అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
సోమవారం 23 జనవరి 2023

బీసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(బి) గ్రామంలో బీసీ సంఘం నూతన గ్రామ కమిటీని ఆ సంఘం నాయకులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా కట్కం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మామూళ్ల గంగాధర్, గౌరవ అధ్యక్షులు విఠల్‌తో పాటు 20 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సంఘ నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కట్కం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మామూళ్ల గంగాధర్ మాట్లాడుతూ గ్రామంలో బీసీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు మేకల రవికాంత్ యాదవ్, సర్పంచ్ మల్కు, గ్రామస్తులు శంకర్, ఓంప్రకాష్, ఆశన్న, వెంకటేష్, గణేష్, భోజన్న రాజన్న, అశోక్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో ధైర్యం నింపడానికే కవాతు : సీఐ నైలు

నవతెలంగాణ-గుడిహత్నూర్

ప్రజల్లో ధైర్యం నింపడానికే కవాతు నిర్వహిస్తున్నట్లు ఇచ్చోడ సీఐ ముదావత్ నైలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో 91వ బెటాలియన్ ఆర్పీఎఫ్ బలగాలతో ప్రధాన కాలనీల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంతమైన వాతావరణంలో శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఉండేందుకే ముందస్తుగా ర్యాలీలు నిర్వహిస్తుంటామని తెలిపారు. అర్పీఎఫ్ 91వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ శంశాంక్, శేఖర్ అధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో ప్రజలకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఎలాంటి సమయాల్లో విధులు నిర్వర్తిస్తుంది. మత కల్లోలాలు జరిగినప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ప్రజలు ఎలా వ్యవహరించాలి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లోకి మహిళల పాత్రపై, ప్రజలకు ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఎల్ ప్రవీణ్, ఏఎస్సైలు రహమాన్ ఖాన్, రాథోడ్ బలరాం పాల్గొన్నారు.

ఏసీడీపై జనాగ్రహం..!

- కరెంటు ఛార్జీల అదనపు భారంపై అసంతృప్తి
- ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు
- బిల్లులు చెల్లించలేక వినియోగదారుల సతమతం



విద్యుత్‌శాఖ నిర్ణయించిన ఏసీడీ ఛార్జీలను నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఖాప్రి గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని అధికారులను విడిపించారు. పోలీసులు కొంతమందిపై కేసులు నమోదు చేసే ప్రయత్నం చేయగా.. గ్రామస్తులంతా ఏకమై అడ్డుకున్నారు. అధికారులు, ప్రజలకు మధ్య పోలీసులు సయోధ్య కుదిర్చి ఈ వివాదం సద్దుమణిగేలా చేశారు.



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ అధికారులు బిల్లులు వసూలు చేస్తున్నారు. చెల్లించని వారి కనెక్షన్ తొలగించే ప్రయత్నం చేయడంతో అక్కడి జనాలు అడ్డుకున్నారు. ఏసీడీ ఛార్జీల పేరిట అధిక భారం మోపడం సరికాదని గ్రామస్తులంతా సమీపంలోని సబ్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో విద్యుత్ అధికారులు, ప్రజలకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

తలమడుగు మండలానికి చెందిన ఆత్రం గోవింద్‌రావు అనే వినియోగదారుడికి నెలవారీ కరెంటు బిల్లు రూ.163వచ్చింది. కానీ ఏసీడీ ఛార్జీ పేరిట అదనంగా రూ.835 బిల్లులో పొందుపర్చారు. చాలా మంది వినియోగదారులకు రూ.వేలల్లో ఏసీడీ ఛార్జీలు రావటంతో లబోదిబో మంటున్నారు. ఒకే సారి పెద్దమొత్తంలో బిల్లులు చెల్లించటం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సైతం ఇదే మాదిరిగా బిల్లులు రావటంతో చెల్లించేందుకు ఆపసోపాలు పడాల్సి వచ్చిందని వినియోగదారులు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యుత్‌శాఖ నిర్ణయించిన అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్(ఏసీడీ) ఛార్జీలపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు వినియోగ ఛార్జీలతో పాటు డిపాజిట్ పేరిట అధనంగా ఆర్థికభారం మోపడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు చోట్ల ఈ ఏసీడీ ఛార్జీలపై నిరసనలు వ్యక్తం కావడం చర్చనీయాంశంగా మారుతోంది. ప్రతిపక్ష పార్టీల నుంచే కాకుండా సామాన్య జనాలు సైతం ఈ ఛార్జీల వసూలుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌శాఖ తీసుకున్న నిర్ణయానికి ఆ శాఖ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికే విద్యుత్‌శాఖ ఛార్జీలు పెంచడంతో ఆర్థికభారంతో సతమవుతున్న జనాలు తాజాగా విధించిన ఏసీడీ ఛార్జీలతో మరింత ఇబ్బందులకు గురికావడం వారి అసంతృప్తికి కారణమవుతోంది. అధికారులు ఇది కేవలం డిపాజిట్ మాత్రమేనని చెబుతున్నా ప్రస్తుతం ఆ ఛార్జీలు చెల్లించాల్సి రావడంతో జనం భరించలేకపోతున్నారు. కూలీనాలి చేసుకొని జీవించే పేదలు ఒకేసారి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఈ ఏడాది ఏసీడీ పేరుతో..!

కిందటేడాది విద్యుత్‌శాఖ డెవలప్‌మెంట్ ఛార్జీల పేరిట అదనంగా బిల్లులు మోపడంతో జనాలు ఇబ్బందులకు గురయ్యారు. కరెంటు వినియోగించిన లోడ్‌ను అనుసరించి ఛార్జీలు వేయడంతో ఒక్కొక్కరు రూ.వేలల్లో బిల్లులు చెల్లించాల్సి వచ్చింది. తాజాగా ఈ ఏడాది సదరు సంస్థ అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్ పేరుతో అదనంగా వసూలు చేస్తోంది. ఇలా వసూలు చేసిన డబ్బులు కేవలం వినియోగదారుల పేరుమీద డిపాజిట్ చేస్తామని వారు సర్వీసును తొలగించిన వెంటనే సంబంధిత డిపాజిట్ తిరిగి చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. పేరుకు డిపాజిటే అయినా ఒకేసారి కరెంటు వినియోగానికి వచ్చిన బిల్లుతో పాటు ఈ అదనపు బిల్లు చెల్లించడం పేదలకు తలకుమించిన భారంగా మారుతోంది. ఓ వైపు అధికారులు బిల్లుల వసూలు కోసం గ్రామాలకు వెళ్తుండటం..ఇదే సమయంలో ఏసీడీ ఛార్జీలు రావడంతో జనం ఒక్కసారిగా ఆగ్రహానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. నెలవారీ బిల్లులతో పాటు వీటిని సైతం చెల్లించాల్సి రావడంతో ఆర్థికభారం కారణంగా అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే అధికారులు, వినియోగదారులకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

సంస్థ ఆదేశాల మేరకే వసూలు

సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏస్ఈ



విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకే ఏసీడీ ఛార్జీలను వసూలు చేస్తున్నాం. ఇవి కేవలం వినియోగదారుల పేరిట డిపాజిట్‌గా మాత్రమే ఉంటాయి. సర్వీసు తొలగించిన తర్వాత తిరిగి వారికే చెల్లిస్తాం. ప్రజలు సహకరించాలని కోరుతున్నాం.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల నియామక రాత పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ డీలర్ల నియామకం కోసం నిర్వహించిన రాతపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుండి 1గంట వరకు పరీక్షా కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ రమేష్ రాథోడ్ పరీక్షా ప్రక్రియను పర్యవేక్షించి, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. 27 దుకాణాలకు గాను 334 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు. పరీక్షకు ఆరుగురు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తి ప్రకారం ఇంటర్వ్యూలకు పిలుస్తామని, ఈనెల 25వ తేదిన ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంటర్వ్యూకు ఒక రోజు ముందు మెరిట్ లిస్టును కార్యాలయంలో ఉంచుతామని వివరించారు.

కేంద్ర పథకాలను పరిశీలించిన ఎన్ఎల్ఎం బృందం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును కేంద్ర తనిఖీ బృందం ఆదివారం దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్, మాడేగాం, నర్సాపూర్ మండలంలోని కుస్లి, రాంపూర్ గ్రామాలలో తనిఖీలు చేపట్టారు. ఎన్ఎల్ఎం మానిటరింగ్ టీం లీడర్ గంగప్ప పర్యవేక్షణలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను సందర్శించారు. ఆసర పెన్షన్ అమలు తీరుతెన్నులపై, ఐకేపీ మహిళా సంఘాలు అందిస్తున్న రుణాల ద్వారా వ్యాపారుల దుకాణాలను, ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనుల జాబితాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్ఎల్ఎం తనిఖీ అధికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసిన పనులన్నింటికీ సూచికలను రూపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, దిలావర్‌పూర్ ఎంపీపీ పాల్దే అక్షర అనిల్, నర్సాపూర్ ఎంపీపీ కొంద్ర రేఖ రమేష్, సిర్గాపూర్ సర్పంచ్ ఇట్టెడి గంగారెడ్డి, మాడేగాం సర్పంచ్ సరిత రాజు, రాంపూర్ సర్పంచ్ గోవింద్ రెడ్డి, కుస్లీ సర్పంచ్ స్వరూప భూమేష్, ఏపీఓ దివ్య, ఎంపీడీఓ ఉషారాణి, ఎంపీఓ అజీజ్ ఖాన్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

అడెల్లి పొచమ్మను దర్శించుకున్న ఉమెన్స్ కార్పొరేషన్ చైర్మెన్

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం తెలంగాణ ఉమెన్స్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఆకుల లలిత కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మెన్ అయిన చందు శాలువాతో సత్కరించారు. అమ్మవారి ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియ అసిస్టెంట్ రమణారావు, కశ్యపు శర్మ, చండీపారణవాద్, రికార్డ్ అసిస్టెంట్స్ సోని, బుచ్చన్న పాల్గొన్నారు.

వార్డు కౌన్సిలర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో అతిపెద్ద కాలనీలో ఒకటైన విద్యానగర్ కాలనీ వాసులు గత 41 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ గార్డెన్‌లో విద్యానగర్ కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వార్డు కౌన్సలర్‌కు ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా పవన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీలోని సుమారు 60 ఇండ్ల పై నుంచి వెళుతున్న 33 కేవీ విద్యుత్‌లైన్‌ను తొలగించాలని వార్డు కౌన్సలర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన సంవత్సరంలోపే సమస్యను పరిష్కరించినందుకు అప్పుడు తొలగింపుకు సహకరించిన మాజీ చైర్‌పర్సన్ దంపతులకు, కౌన్సిలర్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు కాలనీవాసులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు వార్డు కౌన్సలర్ మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్నా నా ఈ జీవితం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి ఉమేష్ రెడ్డి, సామ అశోక్ రెడ్డి, సహాయ కార్యదర్శి గంగన్న, సభ్యులు కొండూరు గంగాధర్, భూమారెడ్డి జలపతి, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరను సందర్శించిన కేంద్ర గిరిజనశాఖ మంత్రి అర్జున్ ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని కలిసి ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 28 ఏండ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ వంద రోజులలో వర్గీకరణ చేస్తామని తమకు హామీ ఇచ్చి ఎనిమిది సంవత్సరాలు గడిచినట్లు వివరించారు. వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడంలో జాప్యం చేయకుండా ఈ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తమకు ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర పెద్దలు ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రులను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు బరుకుంట సుభాష్, పాలేపు గణేష్, జిల్లాపల్లి నవీన్, ఉప్పులేటి శ్రీను, చిట్టి రవి, అడ్డిగ స్వామి, మొదుగు వెంకటేశ్, జన్నరపు సాయి, కొత్తూరి సాయిరామ్, ఎంఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ పసుల శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్‌లు పారదర్శకంగా చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి ఆయా క్యాడర్ల సీనియార్టీ, వేకెన్సీ జాబితాల తయారీ పారదర్శకంగా, తప్పు లేకుండా చూడాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం డీఈఓ ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే 370 బదిలీలలో జరిగిన పొరపాట్ల వల్ల ఎందరో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈసారి జరిగే ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్స్ జాబితాలో తయారు చేసేటప్పుడు పొరపాట్లు జరగకుండా ఉండేందుకు సిబ్బందికి తగు సూచనలు ఇవ్వాలని కోరారు.

'గంగమ్మ తల్లి నా బిడ్డను నాకియ్యి'

- తల్లి కండ్ల ముందే గోదావరిలో మునిగి యువకుడి మృతి
- కాపాడుకోలేక పోయిన కుటుంబికులు





నవతెలంగాణ-హాజీపూర్

తల్లిదండ్రుల కండ్ల ముందే కొడుకు గోదావరిలో గల్లంతై, మృతి చెందిన ఘటన హాజీపూర్ మండలంలోని ముల్కల్ల పుష్కర ఘాట్‌లో చోటు చేసుకుంది. కొడుకు మునిగి పోతున్న కాపాడుకోలేని నిచ్చల స్థితిలో తల్లి తండ్రులు ఉండిపోయారు. పూర్తిగా మునిగిన కొడుకు కనపడక పోయే సరికి "ఓ గంగమ్మ నా కొడుకును నాకీయమ్మ" అంటూ తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కలచివేసింది. ఓ బిట్టు రా బిట్టు అంటూ తల్లడిల్లిన ఆ తల్లి రోదనలు కంటతడి పెట్టించింది. నానమ్మ కర్మ కాండకు గోదావరికి వచ్చిన సల్లం హర్షవర్దన్(బిట్టు)(20) గోదావరిలో స్నానం కోసం మునిగి గల్లంతయ్యాడు. మందమర్రి మండలం రామకృష్ణపూర్‌కు చెందిన సల్లం నారాయణ సింగరేణి ఉద్యోగి కాసిపేట్ గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. 9 రోజుల క్రితం తన తల్లి పోసమ్మ మృతి చెందగా ఆదివారం కర్మ కాండలకు బార్య స్వరూప, కూతురు పావని, కొడుకు హర్షవర్దన్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ముల్కల్ల గోదావరికి వచ్చారు. నారాయణ తన తల్లి కర్మ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో కొడుకు హర్షవర్దన్ స్నానం కోసం గోదావరిలో దిగగా లోతు ఎక్కువ ఉండడంతో అరుస్తూ నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు తేరుకునే లోపే మునిగిపోయాడు. కళ్ళ ముందే కొడుకు మునిగి పోతుం దడంతో తట్టుకోలేక తల్లి హృదయం తల్లడిల్లింది. గంగమ్మ తల్లికి మొక్కుతూ.. వేడుకుంటూ రోదిస్తున్న తీరు అక్కడి వారిని కలచివేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న తహసీల్దార్ రాజలింగం, ఎస్సై ఉదయ్‌కిరణ్, ఎంపీపీ మందపల్లి స్వర్ణలతశ్రీనివాస్, సర్పంచ్ మంచాల శ్రీనివాస్‌లు గజ ఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టిగా రాత్రి 7 గంటలకు హర్షవర్దన్ ఆచూకీ లభించింది. హర్షవర్దన్ సీసీసీ పాలిటెక్నిక్ మైనింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు.

హెచ్చరిక బోర్డ్ లేక పోవడమే కారణమా..?

జిల్లా కేంద్రానికి దగ్గరలో వుండడం ఘాట్ వరకు రోడ్డు సౌకర్యంతోపాటు దగ్గరలోనే నీళ్లు ఉండడంతో ముల్కల్ల పుష్కర ఘాట్ వద్ద నిత్యం వందల మంది పుణ్యస్నానాలు, కర్మ కార్యక్రమాల కోసం వస్తుంటారు. గోదావరిలో లోతు ఎక్కువ ఉండడంతో కనీసం అక్కడ హెచ్చరిక బోర్డ్ కూడా లేక పోవడంతోనే హర్షవర్దన్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు అంటున్నారు. లోతు ఎక్కువ వుందని తెలియకపోవడంతో నా కొడుకు నీటిలో మునిపోయాడని హర్షవర్దన్ తల్లి రోదిస్తుంది.

ఆయిల్‌ఫామ్ తోటల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-బేల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన వన పంటలను ప్రోత్సహించడంతో రైతులకు ఆయిఫామ్ పెంపకంపైన అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రియూనిక్ కంపెనీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల రైతులను అవగాహన కోసం ఆదివారం కొత్తగూడెం, భద్రాచలం జిల్లాలోని దమ్మపేట మండలం మల్కర్ గ్రామంలో పామాయిల్ తోటలను సందర్శనార్థం తీసుకెళ్లారు. మల్కర్ గ్రామ రైతు భుమేశ్వరరావ్ రైతులకు వివరిస్తూ గత 15సంవత్సరాలుగా 50ఎకరాలలో పామాయిల్ మొక్కలను సాగు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం ఒక ఎకరానికి లక్ష రూపాయల వరకు ఆర్జీస్తున్నామని అన్నారు. మొక్క పెంపకంతో పాటు వాటి చిడ పిడలు, ఎరువుల ఖర్చు విషయాల గురించి వివరించారు. రైతులకు గల సందేహాలను పెంపకం రైతు వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అశ్వారావ్‌పేటలోని ఫామాల్ కర్మాగారాన్ని రైతులు వీక్షించారు. ఫ్రియూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ మహేందర్ మాట్లాడుతూ పామాయిల్ మొక్కల పెంపకం కోసం బేల మండల రైతులకు అవగాహన కల్పించారు. అశ్వారావుపేటలో రైతు పొలాన్ని చుపెట్టడం జరిగిందని తెలిపారు. మొక్కల పెంపకం, వాటిలో అంతర మొక్క పెంపకంతో పాటు, రైతుకు ఏవిధంగా దిగుబడి వస్తుందో రైతు అనుభవాలను వివరించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఫ్రియూనిక్ కంపెని బేల ఇన్‌చార్జీ చెన్నవార్ సతీష్, రైతుబంధు సమితి సభ్యులు రాక్రే, మంగేష్, సతీష్ పవార్, విశాల్ గోడే, సుధాకర్ నాగోసే, విశాల్ గొరే, మనోజ్ గెడాం, అవినాష్, రాజు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక వెబ్ సైట్ ప్రారంభించిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల పదోన్నతులు (ట్రాన్స్‌ఫార్మర్స్) విషయమై అదేవిధంగా విద్యాశాఖ సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు చేరవేయడం కోసం విద్యాశాఖ ఆదిలాబాద్ ప్రత్యేకించి వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈఓఏడీబీ.వీబ్లీ.కామ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం ఈ వెబ్‌సైట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ప్రారంభించారు. దీనిని ఉపాధ్యాయుడు పూర్ణచందర్ రూపొందించారు. కార్యక్రమంలో డీఈఓ సీసీ రాజేశ్వర్, సూపరింటెండెంట్ మధు విద్యాశాఖ కార్యాలయ ఎస్ఓ మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హరిబాబు, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసుల భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలి

- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసీలు సాగుచేస్తున్న పోడు భూములకు రాష్ట్ర ప్రభుత్వం భూపట్టాలు ఇవ్వాలని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా అన్నారు. ఆదివారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నాగోబా దేవతను దర్శించుకున్నారు. నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం నాగోబా దర్బార్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నివసించే గిరిజనుల హక్కుల కోసం కుమురం భీం జల్, జంగల్, జమీన్ నినాదంతో ప్రాణాలను అర్పించారని అన్నారు. ఆదివాసీల పోడు వ్యవసాయ రైతులకు పట్టాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రతి రాష్ట్రంలో గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల విద్య, వైద్యం కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఆదివాసుల కోసం 440 ఏకలవ్య గురుకుల పాఠశాలల రూ.30 వేల కోట్లతో నిర్మిస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఆదివాసీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం తాగునీటిని అందించాలన్నారు.



ఆదివాసుల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం ఒక ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా పదవీని కట్టబెట్టారని గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతూ నిజాం సర్కార్ మనుమడు టర్కీ దేశంలో చనిపోతే కేసీఆర్ టోపీ పెట్టుకొని ప్రభుత్వ లాంఛనాలతో ఆతని అంత్యక్రియలు చేయడం సిగ్గు చేటన్నారు. ఆదివాసీలపై ఆయనకు ప్రేమ లేదన్నారు. జోడేఘాట్‌లో కుమురం భీం మ్యూజియానికి వంద కోట్లు కేటాయిస్తానన్న ఆయన కేవలం రూ.25 కోట్ల వరకు ఖర్చు చేసి మోసపర్చారని విమర్శించారు. రూ.30 వేల కోట్ల బడ్జెట్‌తో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు రూ.1లక్ష కోట్లకు పెంచి కమిషన్లు దండుకున్నారని ఏద్దేవా చేశారు. ప్రధాని మోడీ పీఎంఏవై కింద ఇండ్లను కేటాయిస్తున్న ఇక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ వెనుక బడిన ఆదివాసులు నివసించే జిల్లాలో రోడ్డు సౌకర్యం లేక అనేక మందికి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీ మహిళలకు అక్రమ కేసులు బనాయించి జైలులో పెడుతున్న ఘనత కేసీఆర్ సర్కార్‌దని మండిపడ్డారు. ఆదివాసీ మహిళలకు రక్త హీనత వలన ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జీఓనెం.(3)ను వెంటనే పునరుద్ధరించాలని కేంద్రమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రమంత్రికి పలు సంఘాలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, కంది శ్రీనివాస్ రెడ్డి, సుహాసినిరెడ్డి, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, హరి నాయక్, జాను బాయి, మనోహర్ పటేల్, మల్లికార్జున్‌రెడ్డి, బుర్సా పోచ్చయ్య, సర్పంచ్ రేణుక నాగనాథ్, ఆలయ చైర్మెన్ మెస్రం తుకరాం పాల్గొన్నారు.

ప్రజలను పక్కదోవ పట్టించడమే బీజేపీ నాయకుల లక్ష్యం

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ప్రజలను పక్కదోవ పట్టించడమే బీజేపీ నాయకుల లక్ష్యమని, అభివృద్ధి చేయకుండా ఆరోపణలు చేయడమే వారి పని అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లోని సీసీఐ ఫ్యాక్టరీని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పున:ప్రారంభించడంలో విఫలమైన బీజేపీ నాయకులు, ఇప్పుడు సీసీఐ ఫ్యాక్టరీ భూమి విషయంలో బీజేపీ ఎంపీ, జిల్లా అధ్యక్షులు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌లు మాట్లాడటం చూస్తే విడ్డూరంగా ఉందని అన్నారు. గతంలో కేంద్రీయ విద్యాలయం కోసం 7ఎకరాల భూమిని కేటాయించగా, ఇంత వరకు పాఠశాల భవనం నిర్మాణానికి ఒక రూపాయి తీసుకురాని బీజేపీ నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడం సిగ్గుచేటని అన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో ఐటీ టవర్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, వీటిని చూసి ఓర్వలేకనే కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ నాయకులపై ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో జైనథ్ ఎంపీపీ మర్సిశెట్టి గోవర్దన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మెట్టు ప్రహ్లాద్, జగదీష్ యాదవ్, పురుషోత్తం యాదవ్, ఖయ్యూం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నవతెలంగాణ-ముధోల్

ఈనెల 20 నుంచి 22 తేదిలలో సిద్దిపేట జిల్లా శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం తడ్కపల్లిలో జరిగిన శ్రీసరస్వతీ విద్యాపీఠం తెలంగాణ రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో కిశోరవర్గ బాలికల కబడ్డీ పోటీల్లో ముధోల్‌లోని శ్రీసరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రదానాచార్యులు సారథి రాజు తెలిపారు. అక్కడి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు చేతుల మీదుగా బహుమతిని అందుకొని ప్రశంసలు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రధానాచార్యులు సారథి రాజు, ప్రబంధకారిణి సభ్యులు ఆచార్యులు విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరు క్షేత్ర స్థాయిలో (తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక) జరిగే ఆటల పోటిలలో పాల్గొంటారని తెలిపారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్

2

సోమవారం 23 జనవరి 2023

చాప్రాల గ్రామాన్ని సందర్శిన ఎంపీపీ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మారుమూల ప్రాంతాలో ఉన్న జెండాగూడ, చాప్రాల గిరిజన గ్రామాలను ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ ఆదివారం సందర్శించారు. గ్రామాలకు వెళ్లాలంటే సరైన రోడ్డు వసతి లేని గూడాలకు ఎంపీపీ ద్విచక్ర వాహనంపై వెళ్లి అక్కడి గ్రామ ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరంలో ఈ గ్రామాల్లో నీటి సమస్య ఉంటుందని గ్రహించి నీటి సమస్యను పరిష్కరించేందుకు బోరుబావులను పరిశీలించారు. గ్రామాల్లో సమస్యలను నా దృష్టికి తీసుకరావాలని ఎంపీపీ గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామ యువతకు క్రీడా సామాగ్రిని అందించారు. ఎంపీపీ వెంట గ్రామస్తులు ఉన్నారు.

తరాలు మారినా.. బతుకులు మారలే...!

- డబ్బాకాలనీవాసుల దయనీయ జీవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-భైంసా

స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు గడుస్తున్న పేదల జీవన విధానంలో ఎలాంటి మార్పురాలేదు. టెక్నాలజీ రంగం కొత్తపుంతలు తొక్కి కొందరు రాజబోగాలు అనుభవిస్తుంటే, మరి కొందరి జీవనం మురికి వాడల్లో దుర్భరంగా మారింది. పేదప్రజల పట్ల ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నిర్లక్ష్య దోరణితో వ్యవహరించడంతో వారి బతుకులు మరింత దయనీయంగా మారాయి. కనీస సౌకర్యాలు కల్పించి, వారి బతుకుల్లో వెలుగులు నింపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ఉందని అనుకుంటే పొరపాటే, భైంసా పట్టణంలోని రావునగర్ ప్రాంతంలోని డబ్బా కాలనీలో నివసించే మందులోల్ల కులస్తులు అభివృద్ధికి అమడ దూరంలో జీవనం కొనసాగిస్తున్నారు. కనీస సౌకర్యాలు కూడా నోచుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బాకాలనీవాసుల దయనీయ జీవనం

భైంసా పట్టణంలోని రావునగర్ ప్రాంతంలోని డబ్బా కాలనీవాసులు దయనీయ జీవనాన్ని గడుపుతున్నారు. గత 30సంవత్సరాల క్రితం భైంసాకు వచ్చి స్థిర పడ్డారు. వీరి వృత్తి ఇనుపపెట్టెలు, డబ్బాలు, జల్లెడలు, గృహోపకరణాలు తయారు చేసి అమ్మడం. మహిళలు ఆడవాళ్లకు సంబంధించిన చెవి కమ్మలు, ఉంగరాలు గిల్ట్ నగలు అమ్ముకుంటూ బతుకు బండి





సాగిస్తున్నారు. ప్రస్తుతం 60 కుటుంబాలు ఈ కాలనీలో నివాసం ఉండగా కొందరికి ఇండ్ల స్థలాలు ఉన్నాయి. మరికొందరు ఇతరుల స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. చిన్న గుడిసెలో పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా ఉంటారంటే వారి దయనీయ స్థితిని చూస్తే కన్నీరు పెట్టాల్సిందే. గుడిసెల పక్కన గుడ్డలతో కప్పి ఉన్న బాత్రూంలు. ఇంటి ముందంతా మురికి నీరు. ఇది వీరి జీవనస్థితి ఇదంతా తండాలో ఉందంటే నమ్ముతాం భైంసా మున్సిపాలిటీలోనే జీవనం గడుపుతున్న పాలకులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. గత 30 సంవత్సరాలుగా అక్కడే ఉంటూ వారికి ప్రభుత్వం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటు హక్కు కల్పించినప్పటికి కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. తమ సమస్యను పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి మున్సిపల్ కౌన్సిలర్‌కు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. వర్షాకాలంలో అయితే వీరికి నరకమే వర్షపు నీటితో నివాస ప్రాంతమంతా జలమయం అయి పక్కన ఉన్న కళ్యాణ మండపాల్లో ఫంక్షన్‌హాల్లో ఉండాల్సిన దుస్థితి వీరిది. కనీసం విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలు వేయకపోవడంతో రాత్రి అయితే విద్యుత్ దీపాలు లేక అంధకారంలో గడపాల్సిన పరిస్థితి వారిది. మున్సిపల్ పాలకవర్గం రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందుల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా తమను ఆదుకోవాలని డబ్బాకాలనీ వాసులు కోరుతున్నారు. ఇండ్ల స్థలాలు లేని వారికి డబుల్ బెడ్‌రూంలు స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలి



తాతల తరం నుండి గుడిసెల్లో ఉంటున్నాం. స్వంత ఇంటి కల నెరవేరడం లేదు. ఇండ్లు ఇస్తామని చెబుతున్నారే తప్ప ఇప్పటికి ఇండ్లు ఇవ్వడం లేదు.

గంగుబాయి డబ్బాకాలనీ

పాలకులు పట్టించుకోవాలి



పలు మార్లు సమస్యను అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినప్పటికి ఎవ్వరు సమస్యను పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నా.

గాలి రాజు కాలనీ పెద్ద

డ్రైనేజీ, రోడ్ల, నిర్మాణం చేపట్టాలి



ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, కాలనీలో సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

జల్లి సంతోష్ కాలనీవాసీ



రైతు మెస్ ప్రారంభించిన సర్పంచ్



నవతెలంగాణ-తలమడుగు

సుంకిడి గ్రామంలో ప్రతి ఆదివారం సంత జరగడంతో సుంకిడి గ్రామ అయ్యప్ప ఆలయ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సర్పంచ్ మహేందర్ రైతు వేదిక పక్కన గల స్థలంలో రైతుమెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం వివిధ మండలాలతో పాటు పక్కన గల మహారాష్ట్ర గ్రామాల నుండి ప్రజలతో పాటు రైతులు అంగడికి రావడంతో వారి ఆకలి తీర్చేందుకు అయ్యప్ప ఆలయ ఆధ్వర్యంలో రూ.30కే కడుపునిండా భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాములు, శంకర్, వెంకన్న, నర్సింగ్, ఆశన్న నడిపెన్న పాల్గొన్నారు.

భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నిర్మల్

గత 25 సంవత్సరాల నుండి ఒకే క్యాడర్‌లో భాషా పండితులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పరిష్కరించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి ఆదివారం పండిత పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను త్వరితగతిన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధర్ రావు, ప్రధాన కార్యదర్శి జి.రాజేశ్వర్, సభ్యులు జి.రాజేశ్వర్, సంజు, సల్ల శ్రీనివాస్, శ్రీదేవి, హైమావతి, అనురాధ, కవిత, దత్తగిరి, శ్రీనివాస్, భూమన్న పాల్గొన్నారు.

మూడు నెలల వ్యవధిలోని తల్లికూతుళ్ల మృతి

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

మూడు నెలల వ్యవధిలోనే తల్లికూతుళ్ల మృతి చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మీవాడలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన అచ్చ కవిత సంతోష దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అయితే చిన్నతనంలోనే ఇద్దరు ఆడపిల్లలు అనారోగ్యంతో మృతి చెందగా, తాజాగా 18 ఏండ్ల దీప్తి గత మూడు నెలల క్రితం జాండిస్‌తో మృతి చెందింది. దీంతో మనస్థాపానికి గురైన తల్లి అచ్చ కవిత సంక్రాంతి పండగ రోజున పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆదిలాబాద్ లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ, ఆరోగ్యం క్షీణిస్తోందని రిమ్స్‌కు తరలించారు. ఐతే రిమ్స్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీంతో మృతురాలి ఇంట్లో విషాదం నెలకొంది.

రైతు సమస్యల సాధనకు నిరంతరంగా పోరాటాలు

నవతెలంగాణ-ఉట్నూర్

రైతు సమస్యల సాధనకు రైతు సురక్ష సమితి ఆధ్వర్యంలో నిరంతరంగా పోరాటాలు చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి అరకెళ్ల అశోక్ అన్నారు. ఆదివారం స్థానికంగా రైతు సురక్ష సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27న ఉట్నూర్ ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే రైతు భరోసా దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలను పండిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతన్నల సమస్యలను పరిష్కరించాలని, రైతుల సంక్షేమ అభివృద్ధికి ఉపయోగపడే పథకాలు ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కష్ట పడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు. రైతుల సమస్యలపై పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా దీక్షలకు అధిక సంఖ్యలో రైతులు తరలి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఆత్రం రాహుల్, గున్వాంత్, రాజన్న, కిరణ్, శ్రీనివాస్, రాము, భీమ్‌రావ్, సతీష్ పాల్గొన్నారు.

ముగిసిన డీసీసీబీ స్పోర్ట్స్ మీట్

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

గత రెండు రోజులుగా జరుగుతున్న డీసీసీబీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో పోటీలను నిర్వహించగా అందులో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్, షటిల్, క్యారం, చెస్ పోటీలను ఏర్పాటు చేశారు. నిత్యం విధుల్లో ఉండే బ్యాంకు ఉద్యోగులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఆయా విభాగాల్లో తమ ప్రతిభను చాటి విజయాలు సాధించారు. ఇక ముగింపు కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికీ బహుమతులను ప్రదానం చేశారు. ఈ మేరకు జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఆటల పోటీలను ప్రతి యేడు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగస్తులు సరదాగా గడిపేందుకు ఇటువంటి వేదికలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. పోటీల్లో ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని కనబరుస్తూ పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, నాయకులు పండ్ల శ్రీను, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ అభివృద్ధికి రూ.లక్షా విరాళం

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

శ్రీ సాయిబాబా 26వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్మల్ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీకి ఆయన రూ.లక్ష విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ ఆయనను శాలువాతో సత్కరించారు. నిర్మల్ జిల్లా ఫోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణరావు, ప్రభుత్వ ప్లీడర్ చంద్రశేఖర్‌రెడ్డిలను సైతం సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీఐ పార్టీలో పలువురి చేరిక

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని జంగు గూడం గిరిజనులు సీపీఐ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ఎం. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి, విలాస్, నిర్మల్ కార్యదర్శి కుంటాల రాములు పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సురేష్, గిరిజన సమాఖ్య వారి ఆధ్వర్యంలో గూడేంలోని అన్ని కుటుంబాలు సీపీఐలో చేరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ అనేక సంవత్సరాల నుండి గిరిజనుల హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. పోడు భూములకై చలో ఉట్నూరు గొప్ప కార్యక్రమమని, దీనితోనే గిరిజన పోడు హక్కులు వస్తున్నాయని అన్నారు. జంగుగూడలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరినట్టు తెలిపారు. సీపీఐలో చేరినందుకు స్వాగతం పలుకుచునట్లు తెలిపారు. అనంతరం పార్టీ గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా భీంరావ్, మరో ఇద్దరిని కార్యదర్శులుగా 11 మందితో కమీటిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

నిర్మల్ జిల్లా కవులకు గిడుగు రాంమూర్తి జీవన సాఫల్య జాతీయ పురస్కారం

నవతెలంగాణ-నిర్మల్

వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు, భాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు సంఘ సంస్కర్త గిడుగు రాంమూర్తి పంతులు 83వ వర్ధంతి సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు జీవన సాఫల్య జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం శనివారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ కవులు డాక్టర్లకు డాక్టర్ అప్పాల చక్రధారి, పిల్లల వైద్య నిపుణులు, సాహితీ సేవా రంగంలో, డాక్టర్ దామెర రాములు, ఎండీ జనరల్ ఫిజిషియన్, కవిత్వంలో గిడుగు జీవన సాఫల్య జాతీయ అవార్డులను హైకోర్టు జస్టిస్ డా. జి.రాధారాణి, బీసీ కమీషన్ చైర్మెన్ వకుళాభరణం చేతుల మీదుగా అందుకున్నారు. అంతకుముందు రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన ప్రముఖ కవుల చేత కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సభకు విజయబాబు, అధికార భాషా సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మంత్రి శ్రీదేవి అధికార భాషా సంఘం అధ్యక్షురాలు, తెలంగాణ, శత చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు ప్రభు, గిడుగు రాంమూర్తి పంతులు మునిమనుమరాలు కాంతి కృష్ణ, గిడుగు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బిక్కి కృష్ణ , తెలంగాణ తల్లి శిల్ప రూపకర్త బివిఆర్ చారి, ప్రముఖ ఆంగ్ల అనువాదకుడు దామోదర చారి, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాల రక్షణ, నూతనంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయడంతో పాటు ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయించాలని అన్నారు. పని దినాలు 200 రోజులు పెంచాలని అన్నారు. కనీస వేతనం రోజుకు రూ.600 నిర్ణయించాలని అన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించాలని పేర్కొన్నారు. రైతు పండించే అన్ని పంటలకు కనీస మద్దతు ధర అందించాలన్నారు. 57 ఏండ్లకు పైబడిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలని, స్కీం వర్కర్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేయాలని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ విస్తరింప చేయాలన్నారు. 14 వస్తువుల చేర్చి దాని పరిధిని విస్తరించాలన్నారు. ప్రజల అందరికి గృహ వసతి, స్థలం కల్పించాలన్నారు. అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని, దానిని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌కే దాదేమియా, రాజమణి జిల్లా ఉపాధ్యక్షులు, గంగామణి, జిల్లా సహాయ కార్యదర్శి, శైలజా, రాజియా, నర్సయ్య, పోశెట్టి పాల్గొన్నారు.

ఘనంగా నాగోబా మహాపూజ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దేవాలయంలో శనివారం రాత్రి మహాపూజ ఘనంగా నిర్వహించారు. మెస్రం వంశస్తులు, సాంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. మెస్రం వంశస్తులతో పాటు ఆదివాసీ గిరిజనులు, వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాలు భక్తి భావంతో పులకించి పోయాయి. ఈ మహాపూజ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ పీఓ కె.వరుణ్ రెడ్డి, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు రేఖా శ్యామ్ నాయక్, ఆత్రం సక్కు, కోనేరు కొనప్ప, కుమురం భీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అదనపు కలెక్టర్లు చహత్ బాజ్ పాయ్, గౌతమి, రాహుల్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, స్థానిక జెడ్పీటీసీ పుష్పలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-బోథ్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పోచ్చర గ్రామంలో శ్రావణ్ రెడ్డి స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల నుండి క్రికెట్ పోటీలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. ఈ పోటీలలో ఆయా గ్రామాల నుంచి యువకులు పాల్గొని, క్రీడాలను సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు, గెలుపొందిన విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. చత్రపతి శివాజీ సంఘం ఆహ్వాన మేరకు ఆయన పాల్గొనడం జరిగిందన్నారు. యువకులు విద్యార్థులు ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించి, మంచి చదువులు చదువుకొని ఉద్యోగాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు స్వామి, గ్రామస్తులు డాక్టర్ ముత్తన్న, గ్రామస్తులు సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

గొల్లకురుమ యాదవ సంఘ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

గొల్లకురుమ యాదవ్‌ల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సర్పంచ్ సురేందర్ యాదవ్ ఆధ్వరంలోని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో ఆదివారం గొల్లకురుమ యాదవ నాయకులు ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ మండల కేంద్రంలోని గొల్లకురుమ యాదవ సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే గొల్లకురుమ సంఘ భవనానికి తన నిధుల నుండి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. బోథ్ మండల సమస్యలు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, సంఘం అధ్యక్షుడు ఎట్టం ముత్యం, సభ్యులు గొర్ల నారాయణ యాదవ్, గొర్ల రాజు యాదవ్, గ్రామస్తులు నారాయణ యాదవ్, గొర్ల రాజు యాదవ్, కృష్ణ యాదవ్, పోతన్న, విష్ణుదాస్, సూర్య, వంశీ సాయి, కిరణ్ పాల్గొన్నారు.



వచ్చే ఎన్నికల్లో టికెట్ రాకున్నా అధైర్య పడను

- ఎమ్మెల్యే బాపురావు



నవతెలంగాణ-తాంసి

వచ్చే ఎన్నికల్లో టికెట్ రాకపోయినా అధైర్య పడే ప్రసక్తే లేదని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని ఈదుల్లా సవర్గాం గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఇరవై డబుల్ బెడ్ ఇండ్ల నిర్మాణానికి డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బోథ్ నియోజక వర్గం నుండి ఉద్యమం కోసం నా ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొనడం జరిగిందని అన్నారు. నాపై నమ్మకంతో సీఎం కేసీఆర్ రెండు సార్లు టికెట్ ఇవ్వడంతో బోథ్ నియోజక వర్గం ప్రజలు నన్ను గెలిపించుకున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి మండలానికి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. కొందరు గిట్టని వారు నాపై అసత్య ప్రచారం చేసి వచ్చే ఎన్నికల్లో టికెట్ రాదని ప్రచారం చేస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తులు పదవుల్లో ఉన్నప్పుడు ఎంత మేర అభివృద్ధి చేశారో ప్రజలు గమనిస్తారని అన్నారు. నేను ప్రజల కోసం తపించే వ్యక్తిని ఆస్తులు అంతస్తులు కూడబెట్టునే వ్యక్తిని కాను అన్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు మంజూరు చేసి నిధులు కేటాయించామని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. సవర్గాం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి నావంతు కృషి ఎప్పుడు ఉంటుందని అన్నారు. సర్పంచ్‌కు గ్రామస్థుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని, గ్రామాన్ని మరింతా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఇరవై ఇండ్ల నిర్మాణం పనులు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని అన్నారు. మరో ముప్పై ఇండ్లు మంజూరు చేస్తానని అన్నారు. బీజేపీ నాయకులకు నియోజక వర్గ అభివృద్ధి కండ్లకు కనబడుట లేదని అన్నారు. ఒకసారి కంటి వెలుగులో కండ్లను చెకప్ చేసుకొని కండ్ల అద్దాలు పెట్టుకొని చూస్తే అభివృద్ధి కనబడుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునేశ్వర్ భరత్, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ నాగయ్య, అరుణ్ కుమార్, నాయకులు వెంకన్న, సదానంద్, కేశవ్‌రెడ్డి, కృష్ణ, నర్సింగ్, రఘు, భగువాండ్లు, నారాయణ, మహేందర్, చందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల

వైద్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు అందరిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల విషయంలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రెండవ ఏఎన్ఎం విషయంలో నిర్లక్ష్య ధోరణి ప్రభుత్వం విడాలని కోరారు. పెండింగ్ ఏరియాస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బోనగిరి పద్మ, ఉపాధ్యక్షులుగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా మౌలాలి తోపాటు కంపెనీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ నాయకులు మంజుల, సత్యవతి, తులసి, పద్మ, రాజకుమారి, సుగుణ, మాధవి, గాయత్రి పాల్గొన్నారు.

అగ్రికల్చర్ టెక్నాలజీలో మొదటిస్థానం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలకేంద్రానికి చెందిన దుర్గం విక్రమ్ కుమారుడు రాకేష్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వ్యవసాయం, పాడి పశువుల పెంపకం అనే అంశంపై భారతదేశ స్థాయిలో 11 రాష్ట్రాల విద్యార్థులతో అభ్యుదయ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి నలుగురు విద్యార్థులు చివరి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి భువనేశ్వర్‌లో చివరి పోటీలు నిర్వహించగా సిర్పూర్(టి)కి చెందిన దుర్గం రాకేష్ మొదటిస్థానం కైవసం చేసుకోవడంతో నిర్వాహకులు సర్టిఫికేట్‌తో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా తనతో చదువుకున్న మిత్రులు శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు, గురుకులకు మంచిపేరు తీసుకురావాలని అభినందలు తెలిపారు.

'లక్ష్యం' నీరు గారుతోంది..!

- గూడెం ఎత్తిపోతలకు ఆది నుంచి అవరోధాలే
- తరచూ పైపులైన్ల లీకేజీలు
- పంటలకు అందని సాగునీరు
- ఎండుతున్న పొలాలు.. ఆందోళనలో రైతులు

రైతాంగానికి సాగు నీరు అందించాలన్న గత ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రైతులు రెండు పంటలు తీయాలనే లక్ష్యంతో దండేపల్లి మండలంలోని గూడె ఎత్తిపోతల పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించింది. ఏర్పాటు చేసి ఎనిమిదేండ్లు గడుస్తున్నా.. ఎలాంటి ఉపయోగం లేదు. ఆది నుంచి ఈ పథకానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా సాగు నీటి కోసం రైతులకు ఎదురు చూపులు తప్పటం లేదు. తరుచూ పైపులైన్ లీకేజీతో పంటపొలాలకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కూడా మూడు మండలాల్లో పొలాలు ఎండుతున్నాయి. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల నిర్లక్షంతో తమ పొలాలు బీడుబారుతున్నాయని రైతులు ఆవేధన చెందుతున్నారు. తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆందోళన బాటపట్టారు.

నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులకు సుమారు 30 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గూడెం ఎత్తిపోతల పథకాన్ని మొదలు పెట్టింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి అన్ని ఆటంకాలే నీరు విడుదల చేసిన ప్రతిసారి పైప్ లైన్ లీకేజీతో రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు యాసంగి పంట మొదలుకాగానే గూడెం ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేసి వెళ్ళిపోతారు. కానీ రైతుల గోడును పట్టించుకునే వారు మాత్రం లేరు. ఏ ఒక్క సంవత్సరం కూడా పూర్తిస్థాయిలో నీరు అందించిన దాఖలాలు లేవు. ఈ ఏడు కూడా సాగు నీరు అందక పంటపొలాలు ఎండుతున్నాయి.

మూడు టీఎంసీల నీరు అందాలి

మూడు మండలాల కలిపి మూడు టీఎంసీల నీరు అందించేందుకు గూడెం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. తానిమడుగు డిస్ట్రిబ్యూటరి వద్ద ప్రధాన కాలువకు అనుసంధానం చేసి కడెం ఆయకట్టు చివరి వరకు నీరు అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. 30 వేల ఎకరాలకు మూడు టీఎంసీలు అందాల్సి ఉండగా పైపులైన లీకేజీతో కేవలం 15 వేల ఎకరాలకు ఒకటిన్నర టీఎంసీలు మాత్రమే అందుతున్నాయి. అనుకున్న అక్ష్యం నెరవేరక పోవటంతో ఇటీవల ఎమ్మెల్యే దివాకర్ రావు హాజీపుర్ మండలం కర్ణమామిడి వద్ద ఒక టీఎంసీ సాగు నీటి కోసం లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి బీఆర్ఎస్ నాయకులు హంగామా చేశారు. కానీ అది ప్రకటనలకే పరిమితం అయింది. దీంతో రైతులు అటు కడెం నీరు అందక ఇటు ఎత్తిపోతల పథకం నీరు రాక పంటలు ఎండిపోయి నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

కొత్త పైప్ లైన్ వేయాలి

నాసిరకం పైపులతో నిర్మించిన వాటిని తొలగించి నూతన పైపులై నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సదురు కాంట్రాక్టర్లు నాసిరకం పైపులు వాడడం వలన ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.



లీకేజీ అవుతున్న ఎత్తిపోతల పథకం పైప్ లైన్



సాగునీరు లేక ఎండిపోయిన పొలాలు



సాగునీటి కోసం ఆందోళన బాట పట్టిన రైతులు (ఫైల్)

పైప్ లైన్‌లో నిర్మాణంలో లోపాలు ఉన్నాయని వాటిని సరిదిద్దుతే ఈ సమస్యను అధిగమించవచ్చునని రైతులు పేర్కొంటున్నారు. రెండు మోటార్లు ఒకేసారి ప్రారంభించడంతో ఒత్తిడికి తట్టుకోలేక పైపులు పగిలిపోతున్నాయని అందుకు అనుగుణంగా పైప్ లైన్ నిర్మాణం చేపట్టలేదని రైతులు వాపోతున్నారు. ఎత్తిపోతల పథకం ప్రారంభించిన ప్రతిసారి ఏదో ఒకచోట పైప్ లైన్ లీకేజీలతో ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. పాత పైపులను తొలగించి వాటి స్థానంలో కొత్త పైపులను అమర్చితామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు మేలు చేస్తానంటున్న ప్రభుత్వం ఇప్పుడు రైతులను విస్మరిస్తుందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్పందించి గూడెం ఎత్తిపోతలకు శాశ్వత పరిష్కారం చూపకుంటే రైతు ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

నిర్వహణ లోపంతోనే సమస్య

గూడెం ఎత్తిపోతల పథకం ప్రారంభమైనప్పటి నుండి అధికారుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. లిప్టను పట్టించుకునే వారు లేరని స్థానిక రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇంజనీర్ ఎప్పుడు అందుబాటులో ఉండాల్సి ఉండగా ఒక లిఫ్ట్ ఆపరేటర్ తప్ప ఎత్తిపోతల పథకం వద్ద ఎవరు కూడా అందుబాటులో ఉండటం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారుల తీరు మారకపోతే ఎత్తిపోతల పథకం ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

బొలిశెట్టి లక్ష్మీనారాయణ రైతు దండేపల్లి

దండేపల్లి శివారులో ఎత్తిపోతల పథకం కింద ఎకరం భూమి సాగు చేస్తున్నాను. రెండు పంటకు సాగునీరు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కాంట్రాక్టర్ల నాసిరకం పనులతో తీవ్రంగా నష్టపోతున్నాము. పాత పైపులను పూర్తిగా తొలగించి కొత్త పైప్ లైన్ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపించాలి.

పంటలు ఎండిపోతున్న పట్టించుకునే వారే లేరు

నరెడ్ల రవి రైతు దండేపల్లి

గూడెం ఎత్తిపోతల పథకం మీద ఆధారపడి పొలం సాగు చేస్తున్నాను. నాలుగు ఎకరాల పొలం ఉంది. ఎత్తిపోతల పథకం ప్రారంభించిన ప్రతిసారి రెండు లేదా మూడుసార్లు పైప్ లైన్ లీకేజీలతో పంట నష్టం జరుగుతుంది. ఇటీవలే వరి నాట్లు వేశాను సాగు నిరంతక పూర్తిగా పంట ఎండిపోయి నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

జిల్లా మహేంద్ర సంఘంలో మండల వాసులకు చోటు

నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా మహేంద్ర సంఘంతో పాటు అనుబంధ సంఘాలలో మండల కేంద్రానికి చెందిన పలువురికి చోటు దక్కింది. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రధాన సంఘంతో పాటు యువజన, వెదురు పారిశ్రామిక, సాంస్కృతిక సంఘం, మహిళా సంఘం, ఉద్యోగాల సంఘాలలో అధిక ప్రాధాన్యత ఇచ్చి మండల వాసులకు చోటు కల్పించారు. ప్రధాన సంఘం నుంచి జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎమ్.ఆర్ నరసింగరావు, ఉపాధ్యక్షులుగా చిలువేరి నర్సయ్యతో పాటు సాంస్కృతిక సంఘం నుంచి అధ్యక్షులుగా సంద గోపాల్, కోశాధికారిగా పోతు సురేష్, యువజన సంఘం నుంచి ప్రధాన కార్యదర్శిగా నూరు అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా చిలువేరు సుధీర్ కుమార్ ఉద్యోగుల సంఘం నుంచి అధ్యక్షులుగా సూరినేని కొండయ్య, పారిశ్రామిక సంఘం నుండి ప్రచార కార్యదర్శిగా పర్ల కనకయ్య, మహిళా సంఘం నుంచి అధ్యక్షురాలుగా పిల్లి సుశీలలు ఎన్నికైన వారిలోఉన్నారు. వీరిని మండల కమిటీ నాయకులు మేదరి సంఘ కుల పెద్దలు అభినందించారు.

అండర్ పాస్ వంతెన కోసం మూడు గంటల పాటు రాస్తారోకో

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో అండర్ పాస్ వంతెన నిర్మాణాన్ని శివాజీ చౌరస్తా నుంచి నిర్మించాలని స్థానిక జడ్పీటీసీ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. హైదరాబాద్, నాగ్‌పూర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై మండలకేంద్రంలో నిర్మిస్తున్న నాలుగు వరుసుల రహదారి పనుల్లో భాగంగా ప్రస్తుతం డీబీఎల్ కంపెనీ ప్రజలకు అనుకూలంగా కాకుండా ఓ నాయకుడి ఇంటి ప్రక్కన అండర్ పాస్ వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. అనంతరం డీబీఎల్ కంపెనీకి సంబంధించిన జైసూర్య, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. గురువారం డీబీఎల్ కంపెనీ పీడీ, సంబంధిత అధికారులు వస్తున్నారని, వారితో చర్చించి పనులు చేపడతామని, నిర్మాణ పనులు నిలిపివేస్తామని చెప్పడంతో రాస్తారో విరమించారు. ఈ రాస్తారోకోలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, ఆసిఫాబాద్ సీఐ రాణాప్రతాప్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అన్నిగ, వాంకిడి సర్పంచ్ తుకారాం పాల్గొన్నారు.

బాదిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

నవతెలంగాణ-నస్పూర్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన శ్రీరాంపూర్ విశ్వశాంతి హై స్కూల్ కరస్పాండెంట్ సాహెబ్ హుస్సేన్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులైనటువంటి విశ్వశాంతి హై స్కూల్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు తమ వంతు సాయంగా రూ.1,05,753 విరాళాలు సేకరించి వారి కుటుంబానికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇట్టి మొత్తాన్ని వారి పిల్లల పేరు మీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయుడి పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండి ఆర్థిక సహాయం చేయడంలో ముందుకు వచ్చినందుకు ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంబడి రవి, గోపతి మల్లేష్, మెరుగు సమ్మయ్య, బోల్ల మల్లేష్, చుంచు రమేష్, మిడివెల్లి శ్రీనివాస్, సరిత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మీ సేవ నిర్వాహకుడిపై కేసు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-కోటపల్లి

నవతెలంగాణ పత్రికలో ఆదివారం ప్రచురితమైన 'మీ సేవ ముసుగులో దోపిడీ' అనే కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు మీసేవ నిర్వాహకునిపై ఆదివారం కేసు నమోదు చేశారు. ఈకేవైసి చేసుకుందామని వెళ్ళిన బాధితుడి అకౌంట్ నుంచి మీ సేవ నిర్వాహకుడు డబ్బు డ్రా చేసుకున్నాడు. ఎస్సై వెంకట్ బాధితుని దగ్గర నుండి వివరాలు సేకరించి మీ సేవ నిర్వాహకుడు దుర్గం సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలని ఎస్సై సూచించారు. అలాగే మీ సేవ, సీఎస్‌సీ సెంటర్ వద్ద వేలిముద్ర పెట్టీ డబ్బులు తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అమాయక ప్రజలను మోసం చేసి సైబర్ నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.

తోరీ అటవీశాఖ అధికారుల దాడులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తోరై గిరిజన గ్రామంలో ఆదివారం సాయంత్రం అటవీ శాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడులలో 10 దుంగలు రూ.80 వేల విలువ గల కలప పట్టుకున్నట్లు జన్నారం రేంజ్ అధికారి ఆఫీస్ ఉద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కలప నిలువ ఉంచిన రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవున్నారు.

బండి సంజయ్‌కి వినతిపత్రం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు బండి సంజయ్‌కి కేస్లాపూర్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్, ఉపాధ్యక్షులు, గోపికృష్ణ ఆధ్వర్యంలో సమస్యతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నెలనెల వేతనాలు చెల్లించాలని, జూలై నెల నుంచి కొత్త పీఆర్సీని ప్రకటించాలని పేర్కొన్నారు.

బీసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ముథోల్

వెనుకబడిన తరగతుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ముథోల్‌లోని బీసీ సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. అధ్యక్షులుగా గుంజల నారాయణ, ఉపాధ్యక్షులుగా ఆనంద్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా కేదారి నారాయణ, కోశాధికారిగా మేత్రి సాయినాథ్, సహాయ కార్యదర్శిగా పెద్ద కర్రోల మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు కర్రోల్ల రమేశ్, ఎంపీటీసీ భూమేష్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎన్నికైన కార్యవర్గానికి, మాజీ కార్యావర్గానికి గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మాల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-తలమడుగు

మండల మాల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం సుంకిడి గ్రామంలోని రైతు వేదికలో గ్రామ సర్పంచ్ గేల్ల మహేందర్‌తో పాటు మాల సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మాల సంక్షేమ సంఘం క్యాలెండర్ ముద్రించడం పట్ల ఆనంద వ్యక్తం చేశారు. సంఘాలు బలంగా ఉండి అన్యాయం జరిగినచోట ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘ నాయకులు గడుగు పోచ్చన్న, గజానన్, ప్రకాష్, ఆశన్న, రాజశేఖర్, నర్సింగు, రమేష్, ప్రశాంత్, బొండ్ల మల్లయ్య పలువురు పాల్గొన్నారు.

గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-కాసిపేట



గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చెస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండంలోని వెంకటాపూర్ పంచాయతీలోని కుర్రేఘడ్‌లో పాహుండి కుపర్ లింగు స్వామి జాతర రెండో రోజు ప్రధాన ఘట్టం అగ్ని గుండం, పెద్ద పూజ కార్యక్రమం నిర్వహించగా స్వామిని దర్శనం చేసుకొని పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యేను ఆదివాసీ గిరిజనులు వారి సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆదివాసీ దర్బార్‌లో పాల్గొని మాట్లాడారు. కుర్రేఘుడ్కు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.20 కోట్ల మంజూరుకు కృషి చేస్తామని, ఆలయం వద్ద రేకుల షెడ్డు, మరుగు దొడ్ల కోసం రూ.10 లక్షల మంజూరుకు కృషి చేస్తామన్నారు. దీంతో పాటు ఇండ్లు లేని పేదలకు ఇండ్లు మంజూరవుతాయన్నారు. గిరిజనులు తప్పకుండా చదువు కోవాలని, చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోవాచ్చని సూచించారు. కార్యక్రమంలో గురుస్వామి కుర్సింగ భూదేషాన్, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్‌లు సౌంధర్య, జంగు, లక్ష్మీ, దుర్గం పోశం, తిరుపతిరెడ్డి, మంజులారెడ్డి, పెంద్రం హన్మంతు, మడావి వెంకటేశ్, ఆడె శంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కాసిపేట మండలంలోని వెంకటాపూర్ పంచాయతీలోని కుర్రఘడ్ కోలంగూడలో పది మంది గిరిజనులకు ఐటీడీఏ ద్వారా ఒక్కోక్కరికి రూ.3 లక్షల చొప్పున మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం వెంకటాపూర్ పంచాయతీ తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు.

ఇన్సూరెన్స్ చెక్కుల అందజేత

కాసిపేట మండలంలోని మల్కేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆడే సోము ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కును వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చెక్కును అందించారు. రొట్టెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పోగుల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల టీఆర్ఎస్ ఇన్సురెన్స్ చెక్కును అందించారు.

హిమాలయ శిఖరాగ్రానికి చేరిన అభిమానం

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన కారెం సాయిరాంరెడ్డి హిమాలయ శిఖరాన్ని అధిరోహించి ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై ఉన్న అభిమానాన్ని చాటిచెప్పాడు. పట్టుదలతో హిమాలయాల్లోని కేదారకాంత శిఖరం ఎక్కాలన్న పట్టుదలతో తన 21 మంది స్నేహితులతో కలిసి ఆదివారం ఈ శిఖరాన్ని ఎక్కాడు. హైదరాబాద్‌కు చెందిన 20 మంది తన స్నేహితులు వెల్లగా వారితో కలిసి ఈ నెల 18వ తేదీన హిమాలయాల్లోని కేదారకాంత శిఖరం ఎక్కడం ప్రారంభించి ఆదివారం నాటికి 20 కిలోమీటర్ల దూరం 12500 ఫీట్ల ఎత్తుగల శిఖరాన్ని అధిరోహించాడు. తీవ్రమైన చలిలో నాలుగు రోజుల పాటు నడిచి శిఖరం ఎక్కినట్టు సాయిరాం తెలిపారు. ఈ శిఖరం ఎక్కిన అనుబూతిలో ప్రజలకు నిత్యం సేవ చేయాలనే తపనతో ఉన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటాన్ని శిఖరంపై ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. అంతేకాకుండా జాతీయ జెండాను ఎగరవేసి ఇండియా గొప్పతనాన్ని చాటాడు. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతమైన ముత్తంపేట గ్రామం నుండి బయలుదేరి హిమాలయాల్లోని కేదారకాంత శిఖరం ఎక్కడంతో యువకుడి సొంత గ్రామ సర్పంచ్ ఆదె శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులు సాయిరాంరెడ్డి సాహసాన్ని అభినందించారు.

శివకేశవ ఆలయం జాతర వేలంపాట

నవతెలంగాణ-వాంకిడి

రానున్న మహా శివరాత్రి సందర్భంగా మండలకేంద్రంలోని శివకేశవ ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసే దుకాణ సముదాయాలకు ఆదివారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో వాంకిడి గ్రామానికి చెందిన కమ్లెట్‌బంటి రూ.3.56 లక్షలకు దక్కించుకున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గాదె ప్రవీన్ తెలిపారు. గతేడాది జాతర వేలంపాట రూ.1.60 లక్షలు కాగా ఈ ఏడాది రూ.3.56 లక్షలు పలికింది.

కార్మికుల సంక్షేమాన్ని మరిచిన టీబీజీకేఎస్

నవతెలంగాణ-తాండూర్

టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల సంక్షేమాన్ని మర్చిపోయి యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు సిద్ధంశెట్టి రాజమౌళి అన్నారు. ఆదివారం తాండూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థను ప్రయివేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్మికుల పక్షాన పోరాడాల్సిన టీబీజీకేఎస్ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి మెడికల్ కాలేజీ నిర్మిస్తామని, కార్మికులకు సొంత ఇండ్ల నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన టీబీజీకేస్ హామీలను విస్మరించిందన్నారు. మాదారంలో నివాసం ఉంటున్న కార్మికులకు జీవో నెం.59 ద్వారా ఇండ్ల స్థలాలు కేటాయించాలని బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. స్పెషలిస్టుల నియామకం చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, సూరం దామోదర్‌రెడ్డి, మాధవ కృష్ణ సంజీవరెడ్డి, నవీన్, ఓదెలు పార్వతి, సత్తయ్య పాల్గొన్నారు

ఆలయ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గోదావరి నది ఒడ్డున ఉన్న శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ డాక్టర్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. ఆదివారం ఆయన రామాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పురాతన రామాలయ అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి సత్తయ్య, లక్షెట్టిపేట జడ్జి మహమ్మద్ అషదుల్ల షరీఫ్, సీనియర్ అడ్వకేట్ మల్లేష్, పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ కమ్మల సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కమ్మల విజయ్ ధర్మ, ఎంబాటి సత్యం, కోడి సృజన్ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడి గంగాధర్ ఎంపీటీసీ వెంకటస్వామి, జాడి వెంకట్, కె.భుమన్న, గంగన్న పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నస్పూర్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొంద్ర లింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆదివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తొందర్లోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నస్పూర్ బీఆర్ఎస్ అధ్యక్షులు అక్కూరి సుబ్బన్న, పట్టణ ఉపాధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి, పట్టణ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ అండ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కేరమెరి మండలం కేలికే గ్రామానికి చెందిన గిత్తె కార్తీక్ గత నెల 28, 29 తేదీన నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన అంతర్జాతీయ గ్రామీణ చెస్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన నేపథ్యంలో తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు చదువులో రాణించాలని అన్నారు. క్రీడా పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రతిభ ఉన్నా క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఆమె చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో చెస్ క్రీడా పోటీలో బంగారు పతకం సాధించి ఆసిఫాబాద్ జిల్లాకు పేరు తీసుకొచ్చి పిన్నవయసులోనే అంతర్జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన కార్తీకును అభినందనీయుడని కొనియాడారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్, డైరెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని తంతోలి గ్రామస్తులు ఆదివారం నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన కుమ్ర విజయలక్ష్మిరాజు, డైరెక్టర్ పిరంగి మల్లేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువా కప్పి సన్మానించారు. అదిలాబాద్ మార్కెట్‌ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మార్కెట్ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మిరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్. మాజీ ఎంపీపీ సెవ్వ లక్ష్మిజగదీష్, సర్పంచ్ లక్ష్మిభీంరావు, పీఏసీఎస్ చైర్మెన్ బుచ్చన్న, బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి, సాంబయ్య, శివయ్య స్వామి, అరవింద్, ఆశారెడ్డి, వెంకటేష్, రమేష్, వినోద్, అనిల్, మల్లేష్, రాజేశ్వర్, వీరయ్య ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రూ. 2.5లక్షలతో దోబీఘాట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోనే అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యమని కేసీఆర్ ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు లావణ్య రవీందర్ రెడ్డి, నాయకులు దత్తు, రాములు, సురేందర్ రెడ్డి, మల్లేష్, రాజరెడ్డి, విఠల్ రెడ్డి, దిగంబర్ ఉన్నారు.

ఘనంగా భీమయ్యక్ దేవుని వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఇదులవాడ గ్రామపంచాయతీ లోని తేనుగూడ గ్రామంలో అన్నరం భీమయ్యక్ దేవుని వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు జడ్పీటీసీని, ఎంపీపీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇదులవాడ సర్పంచ్ భీమేష్, అప్పపెల్లి సర్పంచ్ బాబురావు, ఇదులవాడ ఉప సర్పంచ్ చిలుకూరి సతీష్, ఎంపీటీసీ రమేష్, నాయకులు మారిశెట్టి కాశన్న, బాల్దరపు మధు, చిలుకూరి తిరుపతి, గడ్డల శ్రీశైలం, బోయిని తిరుపతి, తన్నీరు నారాయణ, భీమయ్య కౌతం రాజేందర్, మల్లేష్, వెంకటేశం, ఎలుగుల సతన్న, గుడి పూజారి ఆత్రం పావుగ పాల్గొన్నారు.